ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
సోమవారం 20 మే 2024



అక్షరాలా రూ.500 కోట్లు!

● ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చు

ఓటర్లకు పంచింది. రోజువారీ ప్రచారాలకు ఖర్చు చేసింది. సభలకు, ర్యాలీలకు జనసమీకరణ చేసినందుకు.. మందు, బిర్యానీలకు.. పోలింగ్ రోజు బూత్‌ల వద్ద అవసరాలకు.. ఇలా ఎన్నికల్లో ప్రధాన పార్టీలు పెట్టిన ఖర్చు చూస్తే కళ్లు తిరుగుతాయి. మన జిల్లాలోనే ఈ ఖర్చులు దాదాపు రూ.500 కోట్లు అయినట్లు అంచనా. ఈ లెక్క ఎక్కువ ఉంటుందే కానీ.. ఏమాత్రం తక్కువ ఉండదు. ఈ ఖర్చుల్లో పుంగనూరు టాప్‌లో ఉన్నట్లు తెలిసింది. ఆ తర్వాత కుప్పం, పలమనేరు ఉన్నాయి. గత ఐదేళ్లు అధికారంలో ఉండటం.. అక్రమ సంపాదన, వసూళ్లు.. వెరసి ఎన్నికల ఖర్చులో వైసీపీనే ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి





- పోటీ పడి మరీ ఖర్చు చేసిన ప్రధాన పార్టీలు
- ముందంజలో ఉన్న వైసీపీ
- పుంగనూరు, కుప్పం, పలమనేరుల్లో అధికంగా..
- రిజర్వుడు నియోజకవర్గాల్లోనూ రూ.50 కోట్లు

కుప్పం ఖర్చు దాదాపు రూ.88 కోట్లు

కుప్పంలో 2.23 లక్షల ఓటర్లున్నారు. వైసీపీ వాళ్లు ఓటుకు రూ.4 వేలు చొప్పున 50 శాతం మందికి.. రూ.44.60 కోట్లు పంపిణీ చేసినట్లు అంచనా. రోజువారి ప్రచారాలు, నామినేషన్ ర్యాలీ.. మద్యం.. వంటివాటికి మరో రూ.3 కోట్లకుపైగా ఖర్చు పెట్టినట్లు తెలిసింది. మొత్తం రూ.48 కోట్ల వరకు ఖర్చయినట్లు అంచనా. ● టీడీపీ వాళ్లు 2 వేలు చొప్పున 80శాతం మందికి.. రూ.35.68 కోట్లను పంపిణీ చేసినట్లు అంచనా. నామినేషన్ రోజు ర్యాలీ, రోజువారి ప్రచారాలు, మద్యం వంటి వాటికి ఖర్చయింది రూ.4 కోట్లకుపైనే అని తెలిసింది. ఇలా మొత్తంగా టీడీపీకి రూ.40 కోట్లు ఖర్చయినట్లు అంచనా. ఇక్కడ ప్రధాన పార్టీల్లో చేరినవారికి డబ్బులు ఇవ్వలేదు.

పలమనేరులో రూ.84 కోట్ల ఖర్చు

పలమనేరు నియోజకవర్గంలోని 2.66 లక్షల ఓటర్లలో 75 శాతం మందికి వైసీపీ రూ.2 వేలు చొప్పున రూ.40 కోట్లు పంచినట్లు అంచనా. ప్రచారానికి వచ్చినవారికి రూ.500 చొప్పున.. నామినేషన్ ర్యాలీ.. సీఎం జగన్ సభకు తరలింపు.. మద్యం, బిరియాని.. వంటి వాటికి మరో రూ.3 కోట్లు వంతున రూ.43 కోట్లు ఖర్చు పెట్టినట్లు అంచనా. ● టీడీపీ కూడా రూ.2 వేలు చొప్పున 75 శాతం మందికి రూ.40 కోట్లు పంపిణీ చేసినట్లు అంచనా. టీడీపీ ప్రచారానికి శ్రేణులు స్వచ్ఛందంగా తరలివచ్చారు. చంద్రబాబు పర్యటన.. శ్రేణులకు భోజనాలు.. చివరి వారం రోజులు బూత్‌ల వారీగా ఖర్చు కలిపి మరో రూ.2 కోట్లు కలిపి మొత్తంగా రూ.42 కోట్లు ఖర్చు పెట్టినట్లు సమాచారం.

చిత్తూరు ఖర్చు రూ.73 కోట్లు..

చిత్తూరు నియోజకవర్గంలో 2లక్షల ఓట్లుండగా.. 80 శాతం మందికి రూ.2 వేలు చొప్పున వైసీపీ వాళ్లు రూ.32 కోట్లు పంపిణీ చేసినట్లు అంచనా. డ్వాక్రా సంఘాల్లోని 60 వేల మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున.. రూ.30 లక్షలు అదనంగా ఇచ్చినట్లు తెలిసింది. చివరి పది రోజుల ప్రచారానికి నగరంలోని 50 డివిజన్లకుగాను ఒక్కోదానికి రూ.40 వేలు చొప్పున.. రెండు మండలాల్లోని 44 పంచాయతీలకు రూ.20 వేలు చొప్పున రూ.3 కోట్లు ఇచ్చినట్లు తెలిసింది. పార్టీలో చేరినవారికి రూ.10 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రచార వాహనాలు, నామినేషన్ ర్యాలీకి జనం తరలింపు, పోలింగ్‌నాడు బూత్‌ల నిర్వహణ వంటివాటికి మరో రూ.3 కోట్లు కలిపి మొత్తం రూ.40 కోట్లు ఖర్చయినట్లు అంచనా.
● టీడీపీ కూడా రూ.2 వేలు చొప్పున 70 శాతం మందికి రూ.28 కోట్లను పంపిణీ చేసినట్లు అంచనా. చంద్రబాబు, బాలకృష్ణ సభల నిర్వహణకు రూ.కోటి.. ప్రచారాలకు, భోజనాలు, మద్యం వంటివాటికి చివరి పది రోజులు ఒక్కో డివిజన్‌కు రూ.40 వేలు, ఒక్కో గ్రామ పంచాయతీలకు రూ.20 వేలు చొప్పున రూ.3 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. ఇక్కడ శ్రేణులు పార్టీలో స్వచ్ఛందంగా చేరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నామినేషన్ ర్యాలీ, పోలింగ్ బూత్‌ల నిర్వహణ వంటివాటికి మరో రూ.కోటి కలిపి రూ.33 కోట్లు ఖర్చయినట్లు అంచనా.

చిత్తూరు పార్లమెంటులో..

చిత్తూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప చెప్పుకోదగ్గ స్థాయిలో ఖర్చు పెట్టలేదని తెలిసింది. ఈయన పూర్తిగా ఎమ్మెల్యే అభ్యర్థుల మీదే ఆధారపడినట్లు సమాచారం. టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు చిత్తూరులో నివాసం, కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని.. పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి ప్రచారాల్లో పాల్గొన్నారు. పెద్దఎత్తున ఖర్చు పెట్టుకుని ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థికి అయిన ఖర్చులో భాగస్వాములైనట్లు తెలిసింది.

నగరిలో రూ.58 కోట్లు

నగరి నియోజకవర్గంలోని రెండు లక్షల ఓటర్లలో 80 శాతం మందికి వైసీపీ నేతలు రూ.2 వేలు చొప్పున రూ.32 కోట్లు పంచినట్లు అంచనా. ఒక్కో పోలింగ్ కేంద్రానికి రూ.6 వేలు, రెండు కేసుల మద్యం (సుమారు రూ.14,400) వంతున 231 కేంద్రాలకు రూ.33.26 లక్షలు ఇచ్చినట్లు సమాచారం. సీఎం జగన్ పుత్తూరు సభ జనసమీకరణకు సుమారు రూ.2 కోట్లు ఖర్చయినట్లు అంచనా. పార్టీలో చేరేవారికి వారి స్థాయిని బట్టి నుంచి రూ.10 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఓ మండల స్థాయి మహిళా ప్రజాప్రతినిధి పార్టీ వీడకుండా ఉండేందుకు రూ.25 లక్షలు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా పార్టీలో చేరేందుకు, పార్టీ నుంచి బయటికి వెళ్లకుండా ఉండేందుకు రూ.2 కోట్లకుపైగా ఖర్చు పెట్టినట్లు తెలుస్తోంది. ఇలా వైసీపీకి రూ.38 కోట్ల వరకు ఖర్చయినట్లు సమాచారం.
● టీడీపీ కూడా ఓటుకు రూ.వెయ్యి చొప్పున 90 శాతం ఓటర్లకు రూ.18 కోట్లు పంపిణీ చేసినట్లు అంచనా. ప్రచారానికి ఒక్కో పోలింగ్ బూత్‌కు రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.23.10 లక్షలు ఇచ్చినట్లు తెలిసింది. టీడీపీ అధినేత చంద్రబాబు పుత్తూరు సభకు రూ.60 లక్షలు, రవాణా, ఇతర నిర్వహణ ఖర్చులతో కలిపి రూ.80 లక్షలు అయినట్లు అంచనా. ఇలా మొత్తం రూ.20 కోట్లు ఖర్చు పెట్టినట్లు సమాచారం. ఇక పార్టీలో చేరేవారికి డబ్బు ఇవ్వలేదని తెలిసింది.

పుంగనూరులో అత్యధికంగా రూ.89 కోట్లు

పుంగనూరు నియోజకవర్గంలో 2.38 లక్షల ఓటర్లలో 80శాతం మందికి రూ.3 వేలు చొప్పున.. రూ.57 కోట్లను వైసీపీ పంపిణీ చేసినట్లు అంచనా. ప్రచారాలకు హాజరైనవారికి రోజుకు రూ.500, బిరియాని, మద్యం అందించారు. వీటితో పాటు పార్టీ శ్రేణులకు పంపకాలు, కుల సంఘాలకు సుమారు రూ.2 కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలిసింది. మొత్తమ్మీద వైసీపీకి సుమారు రూ.61 కోట్లు ఖర్చయినట్లు అంచనా.
● ఇక, టీడీపీ కూడా 70 శాతం ఓటర్లకు రూ.వెయ్యి, రూ.1500 చొప్పున.. దాదాపు రూ.24 కోట్లు పంపిణీ చేసినట్లు అంచనా. పుంగనూరులో చంద్రబాబు సభకు రూ.25 లక్షలు.. నామినేషన్ ర్యాలీ.. కిరణ్‌కుమార్‌రెడ్డి పర్యటన.. ప్రచారాలు.. పార్టీ శ్రేణులకు పంపిణీ.. ఇలా అన్ని కలిపి రూ.2 కోట్లు కలిపి మొత్తం రూ.26 కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలిసింది.
● పుంగనూరులో బీసీవై అధినేత రామచంద్రయాదవ్ ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయలేకపోయారు. ఎన్నికల సమయంలో ఆయనతో పాటు ఆయన ముఖ్య అనుచరుల మీద కేసులు పెట్టిన విషయం తెలిసిందే. నామినేషన్ ర్యాలీ, ప్రచారంలో భాగంగా ఓ రోజు ద్విచక్ర వాహనాల ర్యాలీ, మూడు రోజుల ప్రచారం.. తదితరాలకు రూ.2 కోట్లు ఖర్చు చేసినట్లు అంచనా.



పూతలపట్టులో రూ.50 కోట్లు

పూతలపట్టు నియోజకవర్గంలోని 2.20 లక్షల ఓటర్లలో 70శాతం మందికి రూ.1500 చొప్పున వైసీపీ వారు రూ.23 కోట్లు పంపిణీ చేసినట్లు అంచనా. పూతలపట్టులో సీఎం సభకు పార్టీ ఖర్చు పెట్టినా.. జనాల తరలింపునకు స్థానిక నేతకు రూ.కోటి వరకు ఖర్చయినట్లు తెలిసింది. రోజువారి ప్రచారాలకు వచ్చేవారికి రూ.200 చొప్పున.. ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.30 వేలు ఇచ్చారు. ఈ ఖర్చు రూ.3 కోట్లు కలుపుకొని మొత్తం రూ.26 కోట్లు ఖర్చు పెట్టినట్లు అంచనా.
● టీడీపీ కూడా రూ.1500 చొప్పున 70శాతం మందికి రూ.23 కోట్లు పంపిణీ చేసినట్లు అంచనా. ప్రచారాలకు శ్రేణులు స్వచ్ఛందంగా వచ్చారని పార్టీ వర్గాలు చెప్పాయి. ఇక, పోలింగ్ కేంద్రాల నిర్వహణ, అభ్యర్థి ప్రచారం తదితరాలకైన ఖర్చు రూ.కోటి లోపలే. మొత్తం రూ.24 కోట్లు ఖర్చు పెట్టినట్లు అంచనా.
● కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న ఎంఎస్ బాబు వైసీపీ ఓట్లను చీల్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. 5 వేల ఓటర్లను ఎంపిక చేసుకుని రూ.10 వేలు చొప్పున రూ.50 లక్షలు పంచినట్లు తెలిసింది. షర్మిల సభ, ఆయన ప్రచారం, బూత్‌ల నిర్వహణ వంటివాటికి మరో రూ.15లక్షలు.. మొత్తంగా రూ.65 లక్షలు ఖర్చయినట్లు అంచనా.

జీడీనెల్లూరులో ఖర్చు రూ.50 కోట్లు

జీడీనెల్లూరు నియోజకవర్గంలో 2.04 లక్షల ఓట్లుండగా.. రూ.1500 చొప్పున టీడీపీ వాళ్లు రూ.30 కోట్లు పంచినట్లు అంచనా. చివరి రోజుల్లో ప్రచార ఖర్చులకు ఒక్కో పంచాయతీకి రూ.50 వేలు ఇచ్చారని తెలిసింది. మందుబాబులకు క్వార్టర్.. చివరి రోజుల్లో ద్వితీయ శ్రేణి నాయకులకు రూ.5 వేలు చొప్పున.. 256 పోలింగ్ కేంద్రాల నిర్వహణకు ఒక్కోదానికి రూ.6 వేలు చొప్పున ఇచ్చినట్లు సమాచారం. అన్ని ఎస్సీ కుటుంబాలకు డెబిట్ కార్డు తరహాల్లో కార్డుల్ని పంపిణీ చేశారు. టీడీపీ గెలిస్తే ఆయా కుటుంబాలు ఆ కార్డు నుంచి రూ.5 వేలు తీసుకోవచ్చని చెప్పినట్లు సమాచారం. ప్రతి పంచాయతీకి క్రికెట్ కిట్ అందించారు. ఇలా మరో రూ.2 కోట్లను అదనంగా ఖర్చు చేసినట్లు తెలిసింది. మొత్తమ్మీద రూ.32 కోట్లు ఖర్చు పెట్టినట్లు అంచనా.
● వైసీపీ వాళ్లు 70 శాతం మందికి రూ.1500 చొప్పున రూ.14.28 కోట్లను పంపిణీ చేసినట్లు అంచనా. ఒక్కో పంచాయతీకి రూ.లక్ష చొప్పున నాయకులకు.. చివరి వారం రోజులు ద్వితీయ శ్రేణి నాయకులకు రోజుకు రూ.10వేలు చొప్పున ఇచ్చినట్లు తెలిసింది. ఒక్కో పోలింగ్ కేంద్రం నిర్వహణకు రూ.15 వేలు చొప్పున 256 కేంద్రాలకూ డబ్బులు ఇచ్చినట్లు తెలిసింది. ఇలా ఓటర్లకు పంపిణీ తగ్గించి అదనంగా రూ.3.50 కోట్లను వైసీపీ ఖర్చు పెట్టినట్లు తెలిసింది. మొత్తంగా రూ.18 కోట్లను ఖర్చు చేసినట్లు అంచనా. ఈ నియోజకవర్గంలో ప్రచారాలకు వచ్చినవారికి డబ్బులిచ్చే అలవాటు లేదని.. భోజనాలు, మద్యం అందించినట్లు ప్రధాన పార్టీల మాట.


స్ట్రాంగ్‌రూమ్ వద్ద నిరంతర నిఘా : కలెక్టర్


ఎస్వీసెట్‌లో కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మే 19: ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూముల్లో కేంద్ర బలగాలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పోలీసు అధికారులకు భద్రతా ఏర్పాట్ల గురించి సూచనలు చేశారు. మూడంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 80 సీసీ కెమెరాల ఏర్పాటు చేసి, వాటిని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశామని వివరించారు. వచ్చేనెల 4న కౌంటింగ్ చేపడుతున్న దృష్ట్యా పటిష్ఠమైన బారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డీఆర్వో పుల్లయ్యను ఆదేశించారు. చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, టీడీపీ ప్రతినిధి సురేంద్రకుమార్ ఆయన వెంట ఉన్నారు.

కుశస్థలి నుంచి ఇసుక తరలిపోతోంది

● నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో తోడేస్తున్న అక్రమార్కులు


ముక్కరవానిపల్లె వద్ద కుశస్థలి నదిలో ఇసుక రీచ్ ప్రాంతం


అన్నూరు మార్గంలో ఇసుక అక్రమ రవాణా

కార్వేటినగరం, మే 19: మండలంలోని ముక్కరవానిపల్లె వద్ద ఉన్న కుశస్థలి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిపోతోంది. ఇక్కడి రీచ్ నుంచి ఎలాంటి అనుమతులూ లేకుండా యథేచ్ఛగా సరిహద్దులు దాటించేస్తున్నారు. కేవీ అగ్రహారం, అమ్మపల్లి, కత్తెరపల్లి, ముక్కరవానిపల్లె, కొల్లాగుంట వరకు కృష్ణాపురం ప్రాజెక్టు నుంచి కుశస్థలి నదీ ప్రవాహం కొనసాగుతుంది. ఇక్కడ ఇసుక నిల్వలపై కన్నేసిన అధికార పార్టీ నాయకులు లీజుదారులతో చేతులు కలిపి మైనింగ్ గనుల శాఖ అనుమతి ఇచ్చిన చోట కాకుండా ఎక్కడపడితే అక్కడ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారు. ఫలితంగా నదీ పరివాహక ప్రాంతం బావులను తలపిస్తోంది. తోడిన ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తమిళనాడుకు తరలించి, రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. ట్రాక్టర్ ఇసుకను అవసరాన్ని బట్టి 5,500 రూపాయలకు విక్రయిస్తున్నారు. రాత్రీపగలు తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నా పట్టించుకునే దిక్కులేకుండా పోయింది. నదిలో పరిమితికి మించి ఇసుకను తోడేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రీచ్‌లో యంత్రాలు వాడకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కుతున్నారని, ఎక్స్‌కావేటర్, ట్రిప్పర్లను భారీయెత్తున ఉపయోగిస్తున్నారని, అధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

జడ్పీలో నిధుల దుర్వినియోగంపై విచారణ

● లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన మాజీ అధికారి

చిత్తూరు రూరల్, మే 19: జిల్లా పరిషత్ కార్యాలయంలో బీఆర్‌జీఎఫ్, ఆర్థిక సంఘ నిధులు దుర్వినియోగమయ్యాయని మాజీ ఉద్యోగులు లోకాయుక్తకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టారు. రెండేళ్ల క్రితమే ఈ ఫిర్యాదు ఇచ్చినప్పటికీ అప్పటి సూపరింటెండెంట్ రాజకీయ ఒత్తిడితో విచారణ జరగకుండా ఆపారని విమర్శలున్నాయి. దీనిపై తిరిగి ఆ విశ్రాంత అధికారి ఫిర్యాదు చేయడంతో లోకాయుక్త సీరియస్ అయింది. వెంటనే విచారణ ప్రారంభించి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించింది. దీంతో వారం రోజులుగా జడ్పీలో విచారణ జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారుల్లో గుబులు మొదలైంది.

పొట్టేలు రక్తంతో గంగమ్మ ఉగ్ర చిత్రం

కుప్పం, మే 19: పండుగైనా, పబ్బమైనా కుప్పం కళాకారుడు పురుషోత్తం కుంచె కదులుతుంది. సందర్భోచితంగా చిత్రాన్ని జాలువార్చి కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటుంది. కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరలో భాగంగా ఈనెల 20, 21, 22 తేదీలలో అగ్నిగుండం, అమ్మవారి ఊరేగింపు, విశ్వరూప దర్శనం జరగనున్నాయి. జాతర సందర్భంగా గంగమాంబకు జంతు బలులిచ్చి భక్తులు మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఈ ఆనవాయితీని ప్రతిబింబించేలా ఆయన పెద్ద కాన్వాస్‌పై పొట్టేలు రక్తంతో చిత్రించిన అమ్మవారి ఉగ్రరూపం భక్తితో కూడిన భయానక రసాన్ని ఆవిష్కరిస్తోంది. ఆరుబయట పొలాలలో పరచిన ఉగ్ర గంగమ్మ చిత్రం కుప్పం ప్రజల మనసులను చూరగొంటోంది.



బీఎల్వోలకు బాకీ రూ.1.06 కోట్లు

● రెండేళ్లుగా అందని గౌరవ వేతనం

చిత్తూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బూత్ లెవల్ ఆఫీసర్లకు (బీఎల్వోలు) ప్రభుత్వం రూ.1.06 కోట్ల బకాయి ఉంది. రెండేళ్లుగా ఎన్నికల క్రతువులో పాల్గొంటున్న వీరికి గౌరవ వేతనం ఇవ్వడంపై అధికారులు చొరవ చూపలేదు. ఏటా ఓటరు జాబితా మార్పు, చేర్పుల్లో వీరిది కీలకపాత్ర. గతేడాది ఎమ్మెల్సీ ఎన్నికలు, తాజాగా సార్వత్రిక ఎన్నికలు జరిగిన నేపథ్యంలో బీఎల్వోలు క్షేత్రస్థాయి వివరాల సేకరణలో నిరంతరం కష్టపడ్డారు. గతేడాది జూలై 21వ తేదీ నుంచి ఇంటింటి ఓటరు సర్వే, ఆ తర్వాత ముసాయిదా ఓటర్ల జాబితా, సవరణ, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, ఓటు స్లిప్పుల పంపిణీతో పాటు పోలింగ్ రోజునా కీలకపాత్ర పోషించారు. ఇలా జిల్లాలో 1771 మంది ఉన్నారు. వీరికి ఆరు నెలలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.3 వేలు గౌరవ వేతనం ఇవ్వాలి. రెండేళ్లగా రూ.6 వేలు చొప్పున రూ.1.06 కోట్ల బకాయిలు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఇటీవల జిల్లాకు బడ్జెట్ విడుదలైంది. ఎన్నికల విధులు నిర్వహించిన పీవో, ఏపీవో, ఓపీవో తదితర సిబ్బంది, అధికారులకు పారితోషికం వెంటనే ఇచ్చేశారు. పోలింగ్ రోజునా విధులు నిర్వహించిన బీఎల్వోలకు మాత్రం పైసా ఇవ్వకపోవడంపై వారు అసంతృప్తితో ఉన్నారు.

అదనపు భారం : బీఎల్వోల్లో సగానికిపైగా సచివాలయ ఉద్యోగులుండగా.. మిగినవారు వీఆర్వోలు, వీఆర్ఏలు, పంచాయతీ కార్యదర్శులు. వీరంతా రెగ్యులర్ డ్యూటీకు అదనంగా బీఎల్వో పనులు చేస్తున్నారు. గతంలో క్రమం తప్పకుండా వచ్చే గౌరవ వేతనం.. రెండేళ్లుగా అందడం లేదు.


చిత్తూరు నగరం సంతపేటలో ఓటరు జాబితా ఇంటింటి సర్వే చేస్తున్న బీఎల్వో (ఫైల్ ఫొటో)

పుంజుకున్న టమోటా ధరలు

పలమనేరు/సోమల, మే 19: టమోటా ధరలు అనూహ్యంగా పెరిగాయి. శనివారం 15కిలోల బాక్సు రూ.330 ధర పలకగా.. ఆదివారానికి రూ.470కి చేరాయి. పలమనేరు మార్కెట్‌యార్డులో కిలో రూ.30 పలికింది. రెండు నెలలుగా ఈ ధర రూ.10నుంచి రూ.15వరకే ఉండింది. ఈ క్రమంలో రెండు రోజులుగా ధరలు పెరగడంతో రైతులు ఊరట చెందారు. రెండు నెలలు ధరలు లేకపోవడంతో నష్టాలు చవిచూసిన రైతులు.. ఎండల తీవ్రత తగ్గడంతో మరో విడత టమోటా నాటేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇక, సోమల ప్రాంతంలో పడిన వర్షంతో దెబ్బతిన్న తోటలను రక్షించుకోవడానికి రైతులు మందులు పిచికారీ చేస్తున్నారు.కాగా, వర్షాలతో టమోటా తోటలు దెబ్బతిని దిగుబడి తగ్గడం.. రెండు రోజులుగా చెన్నై, ఆంధ్రప్రాంతం నుంచి టమోటాలను కొనుగోలు చేసకొనేందుకు వ్యాపారులు తరలిరావడంతో ధరలు పెరిగినట్లు చెబుతున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని కోలారు మార్కెట్‌లోనూ టమోటా ధరలు అమాంతం పెరిగాయని రైతులు తెలిపారు.


సోమలలో మార్కెట్‌కు పంపేందుకు సిద్ధంగా ఉన్న టమోటాలు

25 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మే 19: జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 8నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు 25 మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. సరాసరిగా 27.3 మి.మీ వర్షపాతం నమోదైంది. పులిచెర్లలో 73.8, గంగవరం 69.4, సదుం 65.4, ఐరాల 60.8, పూతలపట్టు 60.6, బంగారుపాళ్యం 50.4, పలమనేరు 50.2, పెద్దపంజాణి 44.2, సోమల 42.6, రొంపిచెర్ల 42.2, చౌడేపల్లి 36.2, శాంతిపురం 32.4, తవణంపల్లె 29.6, పుంగనూరు 26.2, చిత్తూరు 25.2, గుడుపల్లి 24.6, కుప్పం 23.4, పెనుమూరు 20.0, రామకుప్పం 18.8, బైరెడ్డిపల్లి 16.8, యాదమరి 9.4, గుడిపాల 8.4, వి.కోట 6.8, గంగాధరనెల్లూరు 5.0, నగరిలో 2.6 మి.మీ వర్షం కురిసింది.

సిట్ విచారణ వేగవంతం

- హింసాత్మక ఘటనలు, కేసుల సమాచారం సేకరణ
- సంబంధిత వ్యక్తుల నుంచీ వివరాల నమోదు


వైసీపీ దాడిలో తగిలిన గాయాన్ని చూపిస్తున్న కూచివారిపల్లివాసి

తిరుపతి(నేరవిభాగం)/చంద్రగిరి, మే 19 : పోలింగ్ రోజు, తర్వాత సంభవించిన హింసాత్మక సంఘటనలపై ఎన్నికల కమిషన్ నియమించిన సిట్ బృందం జిల్లాలో ఆదివారం పర్యటించి విచారణ చేపట్టింది.అదే రోజు రాత్రికే ప్రాథమిక నివేదికను సిట్‌కు నేతృత్వం వహిస్తున్న ఐజీ వినుత్ బ్రిజ్‌లాల్‌కు సమర్పించింది. ఆయా ఘటనలకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లలో పలు లోపాలను గుర్తించి, దానికి బాధ్యులైన కొందరు అధికారులపై చర్యలకు కూడా సిఫారసు చేసినట్టు తెలిసింది.

శనివారం రాత్రి తిరుపతికి చేరుకున్న సిట్ సభ్యులైన డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ ప్రభాకర్ మార్గమధ్యం లోనే మహిళా వర్శిటీ, కూచువారి పల్లెల్లో జరిగిన ఘటనలకు సంబంధించి వివిధ మార్గాల్లో వీలైన మేరకు సమాచారం సేకరించారు. ఆదివారం ఉదయం 10.45 గంటలకు ఎస్వీయూ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. పోలింగ్ మరునాడు 14వ తేదీన పద్మావతీ మహిళా వర్శిటీలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం, అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి వాహనంపై టీడీపీ వర్గీయుల దాడి చేసి ధ్వంసం చేయడం వంటి ఘటనలకు సంబంధించిన కేసుల ఎఫ్ఐఆర్‌లు పరిశీలించారు.ఆ స్టేషన్ సీఐ మురళీ మోహన్ నుంచీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఐఆర్ల ప్రతులు, సీసీ ఫుటేజీలు, ఫొటోలతో కూడిన పెన్ డ్రైవ్‌లను సీఐ మురళీమోహన్ సిట్ బృందానికి అందజేశారు. అనంతరం మహిళా వర్శిటీలో నానీపై దాడి జరిగిన ప్రాంతాన్ని, టీడీపీ వర్గీయులు ఆందోళన చేసి పోలీసు వాహనాన్ని ధ్వంసం చేసిన ప్రదేశాలను పరిశీలించారు. అక్కడినుంచి బయల్దేరి మధ్యాహ్నం 12.20 గంటలకు చంద్రగిరి మండలం కూచివారిపల్లికి చేరుకున్నారు.చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్, సీఐ రామయ్యలతో కలసి పోలింగ్ రోజు రాత్రి హింసాత్మక ఘటనలు జరిగిన ప్రాంతాలను చూశారు. టీడీపీ వర్గీయులు తగులబెట్టిన వైసీపీ సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని, కారును పరిశీలించారు. గ్రామంలోని శ్రీకృష్ణ మందిరం వద్ద గ్రామస్తులతో మాట్లాడారు. పోలింగ్ రోజు రాత్రి ఏం జరిగిందో వారిని అడిగి తెలుసుకున్నారు.


మహిళా వర్శిటీ వద్ద జరిగిన ఘటనకు సంబంధించి ఫొటోలను పరిశీలిస్తున్న డీఎస్పీ రవిమనోహరాచారి

టీడీపీ ఏజెంటును కొట్టినందునే గొడవ

పోలింగ్ రోజు వికలాంగునితో ఓటు వేయించేందుకు యత్నించిన టీడీపీ ఏజెంట్ మురళీధర్‌ను రామిరెడ్డిపల్లికి చెందిన వైసీపీ వర్గీయులు అడ్డుకుని దాడి చేసి కొట్టారని కూచివారిపల్లి గ్రామస్తులు ఆరోపించారు. వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రావడంతో ఆ పార్టీ సర్పంచ్ రామిరెడ్డిపల్లి నుంచీ 200 మందిని రప్పించి తమపై దాడి చేయించారని ఆరోపించారు. పలువురు తమ గాయాలను కూడా చూపించారు. తాము టీడీపీ మద్దతుదారులమని, అందుకే తమపై దాడి చేశారని, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లపై కేసులు పెట్టారని, తిరుపతిలో డాక్టర్‌గా పనిచేస్తూ సోమవారం నైట్ డ్యూటీలో వున్నప్పటికీ కేసులు పెట్టించారని గ్రామ మాజీ సర్పంచ్ కవిత చెప్పారు. పెద్దఎత్తున ఘర్షణ జరిగిందని, ఆ కారణంగా సర్పంచ్ ఇల్లు, కారు ఎవరు తగులబెట్టారో, మరో కారు ఎవరు ధ్వంసం చేశారో గుర్తించలేకపోయామని గ్రామస్తులు వివరించారు. జరిగిన ఘటనలపై ఆధారాలుంటే ఇవ్వాలని డీఎస్పీ రవిమనోహరాచారి గ్రామస్తులకు సూచించారు.అనంతరం సిట్ అధికారులు పొరుగునే వున్న రామిరెడ్డిపల్లి గ్రామానికి 1.05 గంటలకు వెళ్ళి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కారు డ్రైవర్ ఈశ్వరయ్యను విచారించారు. అతడి నుంచీ ఘటనకు సంబంధించిన పూర్వాపరాలను అడిగి తెలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. తాను, మోహిత్ రెడ్డి కారులో వస్తుంటే గ్రామస్తులు అడ్డుకుని వెంటనే కారు తాళాలు, ఐడీ కార్డులు, లైసెన్సు లాక్కొన్నారని ఈశ్వరయ్య సిట్ బృందానికి వివరించారు. దాదాపు 30 నిమిషాల పాటు గ్రామంలోని పలువురిని సిట్ బృందం విచారించింది.

ఎఫ్ఐఆర్‌లలో లోపాల గుర్తింపు... కొందరిపై చర్యలకు సిఫారసు

కూచివారిపల్లిలో పోలింగ్ రోజు రాత్రి జరిగిన ఘర్షణలు, మరుసటి రోజు మహిళా విశ్వవిద్యాలయం వద్ద టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన హత్యాయత్నం, తదనంతర ఉద్రిక్తతలకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లలో పలు లోపాలను సిట్ బృందం గుర్తించినట్టు సమాచారం. అలాగే ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవడంలోనూ, హింసాత్మక ఘటనలు జరిగాక వాటిని


కూచివారిపల్లిలో దహనమైన ఇంటి పరిశీలన

నియంత్రించడం లోనూ, కేసుల నమోదులోనూ బాధ్యతా రహితంగా వ్యవహరించిన కొందరు అధికారులపై చర్యలకు కూడా సిట్ బృందం సిఫారసు చేసినట్టు తెలిసింది. సిట్ ఐజీ అనుమతితో ఈ రెండు ఘటనలపై మరింత లోతుగా విచారణ జరపాలని సిట్ అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. సుమారు 70-80మందిని విచారించాల్సి వుందని, ఘటనల పూర్వాపరాలను బట్టి పోలీసు అధికారులు ఏయే సందర్భాలలో ఏ స్థాయిలో విఫలమయ్యారన్నది అంచనా వేయడానికి వీలవుతుందని వారు భావిస్తున్నట్టు తెలిసింది. సిట్ ఐజీ అనుమతిస్తే ఆ మేరకు విచారణ లోతుగా కొనసాగనుంది.

పోలీసు అధికారుల్లో లోపించిన పారదర్శకత

పోలింగ్ రోజు, తర్వాత జరిగిన హింసాత్మక ఘటనల్లో పోలీసు అధికారులు పారదర్శకంగా వ్యవహరించలేదు. ముఖ్యంగా కూచివారిపల్లి, రామిరెడ్డిపల్లి గ్రామాల్లో పోలింగ్ రోజు వాస్తవంగా ఏం జరిగింది? ఆ రోజు రాత్రి కూచివారిపల్లిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడానికి కారకులు ఎవరు? అన్న విషయాలు పోలీసు అధికారులు ఇంతవరకూ వెల్లడించలేదు. అలాగే పోలింగ్ మరుసటి రోజు మహిళా వర్శిటీ వద్ద నానీపై హత్యాయత్నం జరిగిన సందర్భంలో ఆయన గన్‌మ్యాన్ జరిపిన కాల్పుల్లో ఇద్దరు దాడికి యత్నించిన వైసీపీ వ్యక్తులు గాయపడిన విషయం కూడా పోలీసు అధికారులు వెల్లడించలేదు. హత్యాయత్నానికి పాల్పడిన వైసీపీ వ్యక్తుల్లో ఇద్దరు గన్‌మ్యాన్ కాల్పుల్లో గాయపడ్డారని గానీ, వారి వివరాలు గానీ వెల్లడించలేదు. అలాగే నానీపై హత్యాయత్నం తర్వాత టీడీపీ వర్గీయులు వర్శిటీ ఎదుట ఆందోళనకు దిగినపుడు అలిపిరి సీఐ రామచంద్రారెడ్డిపై దాడి జరిగినట్టు తెలిపే వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. దానిపై కూడా పోలీసు అధికారులు ఇంతవరకూ స్పందించలేదు. కనీసం దాడి జరిగిందా లేదా అన్నది కూడా స్పష్టత ఇవ్వడం లేదు. చిన్నపాటి కేసులపై కూడా ప్రెస్‌మీట్లు పెట్టి మరీ వివరాలు వెల్లడించే అధికారులు ఇంత తీవ్ర ఘటనలు జరిగినపుడు మౌనం వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. ఎవరి ఆదేశాలతో ఈ విషయాలను గోప్యంగా వుంచారు? ఎందుకోసం అలా చేశారు? అన్న ప్రశ్నలకు అధికారుల నుంచీ సమాధానాలు లేవు. ఈ అంశాలపై సిట్ అధికారులు ఎంత వరకూ దృష్టి సారించారో, ఏ మేరకు వివరాలు సేకరించి నివేదికలో పొందుపరిచారో తేలాల్సి వుంది.

పక్కా ప్రణాళికతోనే హత్యాయత్నం!

పోలీసు అధికారులకు ముందస్తు సమాచారం

ఎమ్మెల్యే చెవిరెడ్డి, కుటుంబీకుల కాల్ డేటా పరిశీలించండి!

సిట్ అధికారులకు పులివర్తి నానీ ఫిర్యాదు

పక్కా ప్రణాళికతోనే, ఉద్దేశపూర్వకంగా తనపై హత్యాయత్నం జరిగిందని తిరుపతి జిల్లా చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ ఈసీ నియమించిన సిట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి తిరుపతిలోని యూనివర్శిటీ పోలీస్ స్టేషన్ వద్ద సిట్ అధికారులను నానీ కలిశారు. హత్యాయత్నం ఘటనతో పాటు కూచివారిపల్లిలో జరిగిన ఘర్షణల గురించి కూడా నానీని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నానీ మాట్లాడుతూ తనను అంతమొందించేందుకు పక్కా ప్రణాళికతోనే దాడి చేయించారన్నారు.దీనికి సంబంధించి కేసులో నిందితులుగా నమోదైన భానుకుమార్‌రెడ్డి, గణపతి రెడ్డి కేవలం పాత్రధారులేనని, తెర వెనుక వున్న అసలైన దోషులను గుర్తించాలని కోరారు. ఈ ఘటనకు సంబంధించి వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఆయన సోదరుడు రఘునాధరెడ్డి, వైసీపీ నాయకులు భానుకుమార్‌రెడ్డి, గణపతిరెడ్డిల నడుమ జరిగిన ఫోన్ సంభాషణలను బయట పెట్టాలని, దానికోసం వారి కాల్ డేటాను పరిశీలించాలని కోరారు. వారిని అరెస్టు చేసి విచారణ జరపాలని కోరారు. లేదంటే కేసు విచారణను ప్రభావితం చేసే అవకాశముందన్నారు. అలాగే తనపై హత్యాయత్నానికి సంబంధించి పోలీసు అధికారులకు ముందుగానే సమాచారం వుందన్న అనుమానం వ్యక్తం చేశారు. అందుకే తనపై దాడి జరిగిన తర్వాత 40 నిమిషాల పాటు పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకోలేదని సిట్ అధికారులకు చెప్పారు. దాడి గురించి వారికి సమాచారం ఇచ్చినా కూడా స్పందించలేదన్నారు. దీనిపై కూడా లోతుగా విచారించి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా పోలింగ్ రోజు వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులే పలుచోట్ల టీడీపీ వర్గీయులను రెచ్చగొట్టేలా వ్యవహరించారని ఆరోపించారు. తన స్వగ్రామమైన పాకాల మండలం పులివర్తివారిపల్లికి వైసీపీ అభ్యర్థి 17 వాహనాల్లో అనుచరులను తీసుకెళ్ళి గ్రామస్తులను రెచ్చగొట్టారని చెప్పారు. అక్కడి నుంచీ కాశిపెంట్ల, కూచివారిపల్లెలకు వెళ్ళి అక్కడా ఘర్షణలకు, ఉద్రిక్తతలకు కారణమయ్యారని వివరించారు. పులివర్తివారిపల్లి, కాశిపెంట్ల, కూచివారిపల్లి గ్రామాల్లో వారి తీరును విచారించాలని కోరారు. కూచివారిపల్లిలో ఒకే ఘటనపై వైసీపీ అభ్యర్థి మోహిత్ తన కారు డ్రైవరుతోనూ, తన పీఆర్వోతోనూ వేర్వేరుగా ఫిర్యాదులు చేయించి రెండు కేసులు నమోదు చేయించారని సిట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసుల్లో సంబంధం లేని వారిని నిందితులుగా చేరుస్తున్నారని వివరించారు. కేసుతో సంబంధం లేని వారి పేర్లు తొలగించాలని కోరారు. ఈ మేరకు లిఖితపూర్వకంగా పులివర్తి నానీ సిట్ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు.


సిట్ డీఎస్పీ రవిమనోహరాచారికి తనపై దాడి జరిగిన తీరును వివరిస్తున్న పులివర్తి నాని

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్

తిరుపతి ఎస్పీ హర్షవర్ధనరాజు హామీ


మహిళా వర్శిటీలో స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం/కలెక్టరేట్), మే 19: కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి గట్టి చర్యలు తీసుకుంటానని ఎస్పీ హర్షవర్ధనరాజు చెప్పారు.జిల్లా ఎస్పీగా ఆదివారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ తిరుపతికి రావడం సంతోషంగా వుందన్నారు.అయితే ప్రస్తుత పరిణామాల నడుమ బాధ్యతలు తీసుకోవడం సవాలుతో కూడుకున్నది అయినప్పటికీ ప్రణాళికాబద్ధంగా పని చేసి అధిగమిస్తానని చెప్పారు. శాంతి భద్రతలు కాపాడే విషయంలో రాజీ లేకుండా పనిచేస్తానని చెప్పారు. అనంతరం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి మహిళా వర్శిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు.సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేసి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూముల వద్ద భద్రతను పరిశీలించారు.

కోనకు చేరిన పెంచల స్వామి

- నృసింహుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



గోనుపల్లి నుంచి కోనకు బయలుదేరిన శ్రీవారి పల్లకీని మోస్తున్న భక్తులు - అలంకరణలో నృసింహ స్వామి

డక్కిలి, మే 19: వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు మండలంలో వున్న గోనుపల్లి, గోనుపల్లి గిరిజన వాడలు ఆదివారం గోవింద నామ స్మరణతో మార్మోగాయి. ఉభయ దేవేరులతో కలిసి పెంచల నృసింహ స్వామి బ్రహ్మోత్సవాల కోసం పెంచలకోనకు బయల్దేరారు. గోనుపల్లిలోని పెంచల ఆలయం నుంచి పల్లకిలో చెంచులక్ష్మీ దేవి ఇంటికి చేరుకొన్నారు. కొత్తల్లుడి రాకతో గోనుపల్లి గిరిజన వాడ జనం తమ ఆచారం ప్రకారం పుట్టతేనె, ఇంజేటి గడ్డలు, నారె మొలతాడును సారెగా ఇచ్చారు. గిరిజన వాడలోని ప్రతి ఇంటి వద్ద నేరేడు ఆకులతో పచ్చటి పందిళ్ళు, ఇండ్ల ముంగిట రంగవల్లులు వేసి వధూవరులకు ఘనంగా స్వాగతం పలికారు. అత్తారింటికి చేరిన వరుడు నరసింహస్వామిని చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకొన్నారు.ప్రత్యేక పూజల అనంతరం ముత్తైదువులు వధూవరులను పొలిమేర వరకు సాగనంపారు. పూలతో అలంకరించిన పల్లకీలో దేవేరులతో కలిసి కొలువు దీరిన స్వామివారు గ్రామ శివారులోని గొల్లబోయి ఆలయానికి చేరుకొని తొలిదర్శనం గొల్లబోయికి ఇచ్చారు. అనంతరం బోయీలు పల్లకీ మోసుకొంటూ 6 కిలో మీటర్లు కాలినడకన పెంచల కోనకు పయనమయ్యారు.సహజసిద్ధమైన ప్రకృతి అందాల నడుమ వందలాది భక్తుల మధ్య స్వామివారు కోనకు చేరుకున్నారు. ఐదురోజుల పాటు బ్రహోత్సవాలు జరుపుకొని తిరిగి స్వామి వారు ఈ నెల 25వ తేదీన గోనుపల్లికి చేరుకొంటారు. కాగా, పెంచలకోనలోని శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అంకురార్పణతో మొదలయ్యాయి.

ఆర్టీసీ బస్సు ఢీకొని చిరువ్యాపారి దుర్మరణం

రామకుప్పం, మే 19: రామకుప్పం మండలం ఉస్సిగాని పల్లె పంచాయతీ ఆనిగానూరులో శనివారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొని చిరువ్యాపారి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని బల్ల పంచాయతీ పెద్దకురబలపల్లెకు చెందిన వెంకటేశ్(40) తోపుడు బండిలో కూరగాయలు తీసుకుని చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. శనివారం రాత్రి యథాప్రకారం ఆనిగానూరు గ్రామంలో వ్యాపారం ముగించుకుని, స్వగ్రామానికి పయనమయ్యాడు. ఆదే సమయంలో


వెంకటేశ్(ఫైల్ ఫొటో)

విజలాపురం నుంచి కుప్పం వెళ్తున్న ఆర్టీసీ బస్సు తోపుడుబండితో బాటు వెంకటేశ్‌ను ఢీకొంది. దీంతో అతడు తీవ్రగాయాలపాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. అయితే అతడు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటేశ్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రామకుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తింటి ఆరళ్లకు వివాహిత బలి

- బావిలో దూకి ఆత్మహత్య

రామకుప్పం, మే 19: రామకుప్పం మండలం బల్ల పంచాయతీ లక్ష్మీనగర్‌లో అత్తింటి ఆరళ్లను భరించలేక ఓ వివాహిత బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కుప్పం మండలం పెద్దవంకకు చెందిన కనకరాజు, కస్తూరి దంపతుల కుమార్తె సుమిత్ర(24)కు, రామకుప్పం మండలం లక్ష్మీనగర్‌కు చెందిన చిన్నతంబి, సంపూర్ణ దంపతుల కుమారుడు పెరుమాళ్(26)తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల కొంతకాలంగా భర్త, అత్త సూటిపోటి మాటలతో ఆమెను వేధించే వారు. తరచూ కుటుంబంలో గొడవలు జరిగేవి. ఈ నెల 16న పెరుమాళ్, సుమిత్ర తమిళనాడు సరిహద్దు గ్రామంలో బంధువుల ఇంట జరిగిన ఓ వేడుకకు వెళ్లారు. అక్కడ కూడా వారు గొడవ పడ్డారు. 17న ఇంటికి చేరుకోగా.. అదే రోజు మధ్యాహ్నం పెరుమాళ్ బెంగళూరుకు పయనమయ్యాడు. సాయంత్రం పశువులకు గడ్డి వేసిన తర్వాత సుమిత్ర కనిపించకుండా పోయింది. విషయం తెలుసుకున్న ఆమె తల్లి తన కుమార్తె కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు మిస్సింగ్ కేసు


సుమిత్ర (ఫైల్ ఫొటో)

నమోదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో సుమిత్ర శవమై కనిపించింది. స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, ఎస్ఐ శివకుమార్ తమ సిబ్బందితో వెళ్లి.. మృతదేహాన్ని బయటకు తీసి కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా పెరుమాళ్, చిన్నతంబి, సంపూర్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.



మామిడిచెట్లను విరిచేసిన ఏనుగులు - ఏనుగుల దాడిలో దెబ్బతిన్న అరటిచెట్లు

పంటలపై ఆగని గజ దాడులు

కల్లూరు, మే 19: పులిచెర్ల మండలం చల్లావారిపల్లె, పాతపేట పంచాయతీల్లో శనివారం రాత్రి పంట పొలాలపై ఏనుగుల గుంపు దాడులు చేశాయి. పంటలకు అపార నష్టం వాటిల్లింది. మండలంలో గతేడాది మామిడికాయల సీజన్‌లో గజ దాడులు మొదలయ్యాయి. అప్పట్లో మామిడి రైతులను తీవ్రంగా నష్టపరిచాయి. మళ్లీ ఇదే మామిడికాయల సీజన్‌లో మండలంలో ఏనుగల గుంపు దాడులకు దిగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముందుగా అటవీప్రాంతం నుంచి పాతపేట సమీపానికి చేరుకున్న సుమారు 10 ఏనుగుల గుంపు ఘీంకారాలు చేస్తూ పంటలకు నష్టం కలిగించాయి. ఏనుగుల అరుపులతో పాతపేట ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పాతపేటకు చెందిన రైతులు చిన్నరెడ్డెప్ప, బాలసుబ్రమణ్యం, గుర్రప్ప, ఈశ్వరయ్య, నాగరాజు, రమేష్‌కు చెందిన మామిడి చెట్లను విరిచేశాయి. మామిడి కాయలను ఇష్టానుసారంగా నేలరాల్చాయి. వెంకటరత్నంకు చెందిన అరటి, పశుగ్రాసంను తొక్కేశాయి. సురేష్‌కు చెందిన మల్బరీపంటను.. సుబ్రమణ్యంకు చెందిన డ్రిప్ పైపులను తొక్కి నాశనం చేశాయి. అనంతరం చల్లావారిపల్లి వైపు వెళ్లిన ఏనుగులు.. అదే గ్రామంలోని రైతు ఎస్వీ రమణకు చెందిన మామిడిచెట్లను విరిచేశాయి. సుమారు టన్ను మామిడికాయలను నేలరాల్చాయి. డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. మూడు నెలల క్రితం మండలాన్ని ఏనుగుల గుంపు వదిలి వెళ్లడంతో ఊపిరి పీల్చుకున్న రైతులకు.. మళ్లీ ఏనుగులు రావడంతో ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను నివారించాలని కోరారు.

మైనింగ్ కోసమే ఆఫ్రికాకు భారీ వాహనాలు

మంత్రి పెద్దిరెడ్డి



తిరుపతి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆఫ్రికాలో తాము నిర్వహిస్తున్న మైనింగ్ కాంట్రాక్ట్ అవసరాల కోసమే ఇండియా నుంచి పొక్లెయిన్లు, టిప్పర్లు ముంబై పోర్టునుంచి పంపుతున్నామని, టీడీపీ నేతలు ఆరోపిస్తున్నట్టు వాటిలో నగదు, బంగారు పంపించడం లేదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి చెప్పారు. ఆదివారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు.తాము నిర్వహిస్తున్న పీఎల్ఆర్, జస్విన్ సంస్థల తరపున ఆఫ్రికాలో ఫెరో మ్యాంగనీస్, ఫెరో సిలికా మైనింగ్ కాంట్రాక్ట్ పనులు చేపట్టామన్నారు. దశలవారీగా వంద భారీ వాహనాలను, యంత్రాలను పంపుతున్నామన్నారు.దీనికే దేశాలు వదిలి పారిపోతున్నామని చెప్పడం హాస్యాస్పదమన్నారు.పోలింగ్ శాతం పెరగడానికి కారణం మహిళలేనని, ఐప్యాక్ సర్వేలో మహిళలు తమకే ఓట్లు వేసినట్టు తేలిందన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



పలమనేరు, మే19 : పలమనేరులోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పుచ్చలపల్లి జీవిత చరిత్రను, కార్మికుల హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గిరిధరగుప్తా, ఓబుల్‌రాజు, భువనేశ్వరి, అంజి, శ్రీరామయ్య, సంజయ్‌శర్మ, నరసింహులు, లక్ష్మయ్య, మహిళా సంఘ నాయకురాళ్లు ఖైదీనీషా, సరోజమ్మ, ధనమ్మ, జయంతి, హరి పాల్గొన్నారు.

బలిజ సంఘం ఆధ్వర్యంలో గంగమ్మకు అభిషేకం



పలమనేరు, మే19 : పలమనేరులో ఆదివారం గంగమ్మకు బలిజసంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. జాతరకు రోజుకో కులసంఘం అన్న దానం చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో బలిజలు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ అడ్వొకేట్ గంగయ్యనాయుడు, బలిజ సంఘం నాయకులు సుధాకర్, పీజేసీ బాబు, ఆకుల గజేంద్రప్రసాద్, అక్కంగారి మూర్తి, అక్కంగారి కిరణ్‌కుమార్, నరేష్, కాంట్రాక్టర్ శంకర, రంగాకేఫ్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గొబ్బిళ్ల కోటూరులో భగవద్గీతపై ప్రచారం



పలమనేరు, మే19 : పలమనేరు మున్సిపాలిటీ గొబ్బిళ్లకోటూరు గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవాసమితి ఇందుజ్ఞానవేదిక సభ్యులు ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందుజ్ఞానవేదిక పలమనేరు, బంగారుపాళ్యం కమిటీల అధ్యక్షులు భాస్కర్, బాలాజి, సభ్యులు ఉదయ్, రాజేంద్ర, జీవరత్న, వింధ్య, హేమంత్, జ్యోతి, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

రూ.6 లక్షల విలువైన వినికిడి యంత్రాల పంపిణీ



వినికిడి యంత్రాలు పొందినవారితో దాతలు, కళామందిరం సభ్యులు

గంగవరం, మే 19: పలమనేరు నియోజకవర్గ పరిధిలో వినికిడి సమస్య కలిగిన పిల్లలకు స్థానిక కళామందిరంలో రూ.6 లక్షల విలువైన వినికిడి యంత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆదివారం బెంగళూరుకు చెందిన జాయినింగ్ ద డాట్స్ ఫౌండేషన్ వారు ఈ వినికిడి యంత్రాలను తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు ఆధ్వర్యంలో మొదటి విడతగా 18 మందికి పంపిణీ చేశారు. భవిష్యత్తులో వినికిడి లోపం ఉన్నవారందరికీ దశలవారీగా అందిస్తామని జేటీడీ నిర్వాహకులు ధనంజయ, విజయ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి కార్యదర్శి పుష్ప, ఎంఈఓలు వేణుగోపాల్ రెడ్డి, బాలసుందరం, సాయిలీల, డాక్టర్ మాధవి, ఉమామహేశ్వరరెడ్డి, భవిత సిబ్బందితో పాటు పలువురు పాల్గొన్నారు.

అధ్వానపు రోడ్లు బాగుచేయండి



పైపులైన్ కోసం తీసిన గాడి సక్రమంగా పూడ్చకపోవడంతో అధ్వానంగా ఉన్న కొత్తపేట రోడ్డు

పుంగనూరు రూరల్, మే 19: పుంగనూరులో వివిధ వీధుల్లో పైపులైన్ల కోసం సిమెంట్ రోడ్లు పగలకొట్టి తర్వాత పూర్తి స్థాయిలో రిపేర్లు చేయకపోవడంతో పలు చోట్ల రోడ్లు అధ్వానంగా తయార య్యాయి. ప్రైవేటు వ్యక్తులు, ప్రభుత్వం పైపులైన్లు, కేబుల్ వర్క్ తదితర పనుల కోసం బాగున్న రోడ్డును తవ్వేస్తున్నారు. పనులు పూర్తయ్యాక పాడైన రోడ్డును అలాగే వది లేస్తున్నారు. పట్టణంలోని కొత్తఇండ్లు, కొత్తపేట, చౌడేపల్లె రోడ్డు తదితర ప్రాంతాల్లో చిన్నచిన్న సందుల్లో వేసిన సిమెంట్ రోడ్డు తవ్వడం తర్వాత పూడ్చకుండా అలాగే వదిలేయడంతో పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు, సైక్లిస్టులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. సాయిబాబా ఆలయం వద్ద గల రోడ్డు మధ్యలో కాలువ వలే ఉండటంతో ప్రజలు అవస్థలు డుతున్నారు. మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు అధ్వానంగా ఉన్న రోడ్లు బాగుచేయాలని పట్టణ ప్రజలు కోరారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, మే19: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఉదయం ఆలయంలో అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు అర్చనలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచియే గాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు.

కనుల పండువగా ఆది దంపతుల కల్యాణం



చౌడేపల్లె, మే19: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో 7వ రోజు వేదపండితులు శాస్త్రోక్తంగా ఆదిదంపతులకు కళ్యాణం నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమార, మహేష్ దీక్షితులు పంచామృ తాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి ఆలయంలో మృత్యుంజయేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కళ్యాణం జరి పించారు. అనంతరం పూలతో, ప్రభలతో, విద్యుత్ దీపాలతో అలంకరించిన గజవాహనంపై స్వామి అమ్మవార్లను అధిష్ఠింపజేశారు. తర్వాత మంగళ వాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాల నడుమ పుర వీధుల్లో ఊరేగించారు. మహిళలు కర్పూర హారతులు సమర్పించారు. ఉభయదారులుగా దొంతె శివశంకర్, మజరారెడ్లు వ్యవహరించారు.

అశ్వవాహనంపై ఆదిమ దైవం



కుప్పం, మే 19: ఆదిమ దైవం అమ్మతల్లి. ఆ అమ్మతల్లికి ప్రతిరూపమే గ్రామ దేవతలు. కుప్పంలో వెలసిన అనాది దైవమైన ప్రసన్న తిరుపతి గంగమాంబ ప్రతిరూపమైన ముత్తు మారెమ్మ అమ్మవారు ఆదివారం రాత్రి అశ్వవాహనంపై వేంచేశారు. యోధోచిత అలంకరణలో అశ్వా రూఢులై కదం తొక్కారు. ఉదయం నుంచి గంగమ్మ అమ్మవారితోపాటు ముత్తు మారెమ్మ అమ్మవారికి కూడా ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఎస్పీ మణికంఠతోపాటు పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అవుతుండగా ముత్తుమారెమ్మ ఉత్సవ మూర్తికి ప్రత్యేక అలంకరణ చేశారు పూజారులు. అశ్వవాహనికి సైతం మెరుగులు దిద్దారు. అమ్మవారిని పూజారులు ఊరేగింపుగా తీసుకొచ్చి అశ్వవాహనారూఢురాలిని చేశారు. అంతే.. ముత్తుమారెమ్మ కుప్పం వీధులలో కదం తొక్కారు. కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిస్తున్న భక్తులను కరుణించారు. పట్టణమంతా ఊరేగిన అమ్మవారు ఈ అర్ధరాత్రి ముగుస్తుండగా తిరిగి ఆలయాన్ని చేరుకుని సేదతీరారు.

నేడు అగ్నిగుండ మహోత్సవం

ఈనెల 15వ తేదీన చాటింపుతో ప్రారంభమైన గంగమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా సోమవారం అగ్ని గుండ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుంది. ఎస్పీ మణికంఠ కూడా శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన ఏర్పాట్లను ఆదివారం పరిశీలించి వెళ్లారు. డీఎస్పీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేపట్టాయి. ఇదిలా ఉండగా మంగళవారం గంగమ్మ అమ్మవారి శిరస్సు ఊరేగింపు, బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనంతో గంగ జాతర ముగియనుంది.

కుప్పం జాతరకు పటిష్ఠ భద్రత : ఎస్పీ



గంగమ్మ దర్శనం చేసుకున్న ఎస్పీ మణికంఠ

కుప్పం, మే 19: కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర ఏర్పాట్లను ఆదివారం జిల్లా ఎస్పీ మణికంఠ పరిశీలించారు. జాతరలో భాగంగా ఈనెల 20వ తేదీన అగ్నిగుండ మహోత్సవం, 21న అమ్మవారి శిరస్సు ఊరేగింపు, 22వ తేదీన గంగమ్మ విశ్వరూప దర్శనం ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ మూడు రోజులలో ఒక్క ఆంధ్రానుంచే కాకుండా పొరుగున ఉన్నత తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలనుంచి కూడా భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి అమ్మవారిని ర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఈ నేపథ్యంలో జాతర ఏర్పాట్ల పరిశీలనకు ఎస్పీ కుప్పం వచ్చారు. ఆలయ పరిసరాలతోపాటు గంగబావి తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఆయా చోట్ల జరుగుతున్న జాతర ఏర్పాట్లు చూశారు. ఆలయ నిర్వాహకులకు, స్థానిక పోలీసు అధికారులకు పలు సూచనలు చేసి, సలహాలు ఇచ్చారు. అనంతరం డీఎస్పీ శ్రీనాథ్‌తోపాటు కుప్పం అర్బన్ సీఐ రమణ, ఎస్‌ఐలు, ఇతర సిబ్బందితో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ ఎన్నికల అనంతరం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల లో జరుగుతున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకుని కుప్పం గంగజాతర ఏర్పాట్లను చాలా పటిష్ఠంగా చేయాలని ఆదేశించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాల న్నారు. ఇతర ప్రాంతాలనుంచి సైతం పోలీసు బలగాలను రప్పించి ఈ మూడు రోజులలో కుప్పంలో విధులు కేటాయిస్తామ న్నారు. జాతర నిర్వహణ ప్రదేశాలలో ట్రాఫిక్ మళ్లిస్తామని, అదే సమయంలో ఇటు భక్తులకు, అటు ప్రయాణి కులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూస్తామని అన్నారు. పిక్ పాకెటింగ్, ఆకతాయిల అల్లరి లేకుండా ఎక్కడికక్కడ క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచుతామని తెలియజేశారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున జాతర సమయంలో ఎటువంటి డీజేలు, గుంపులు కూడే ఇతర కార్యక్రమాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలతోపాటు అన్నివర్గాల ప్రజలు జాతర సజావుగా జరగడానికి సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

గంగమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎస్పీ: జాతర ఏర్పాట్ల పరిశీలన నిమిత్తం కుప్పం వచ్చిన జిల్లా ఎస్పీ మణికంఠ నూతనంగా నిర్మాణంలో ఉన్న ఆలయంలో అసంపూర్తి గంగమ్మ స్వరూపాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆపక్కనే ఉన్న ముత్తు మారెమ్మను దర్శించుకున్నారు. ఆలయ పూజారులు ఆయనకు అమ్మవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆశీర్వచనం ఇచ్చారు.

వేరుశనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి



సోమలకు చేరుకున్న వేరుశనగ విత్తన కాయలు

కల్లూరు, మే 19: పులిచెర్ల మండలంలోని ఆర్బీకేల్లో సోమవారం నుంచి వేరుశనగ విత్తన కాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు తెలిపారు. మండలానికి 1099 క్వింటాళ్ల విత్తన కాయలు వచ్చాయని పేర్కొన్నారు. 30కిలోల బస్తా ధర 40 శాతం సబ్సిడీ పోనూ రూ.1710కు ఇస్తామని తెలియజేశారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరుతో ఆర్‌బీకేలను సంప్రదించాలని కోరారు. ఈ నెల 23 నుంచి పంపిణీ చేస్తామని వివరించారు.

రొంపిచెర్ల: మండలానికి 1100 క్వింటాళ్ల వేరుశనగవిత్తన కాయలు వచ్చాయని ఏవో శ్రీనివాస్ తెలిపారు. కే-6రకం విత్తనకాయలు వచ్చాయన్నారు. తొలుత ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలియజేశారు.

సోమల: వేరుశనగ విత్తన కాయల కోసం ఆర్బీకేలో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఏవో సుధాకర్ తెలి పారు. విత్తన కాయలు పొందిన రైతులు తప్పనిసరిగా పంట సాగుచేయాలని స్పష్టంచేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు..నలుగురికి తీవ్ర గాయాలు




ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు, గాయపడిన ఆనంద్

వి.కోట, మే 19: వి.కోట - పేర్నాంబట్ ప్రధాన రహదారిలో బంగ్లాఊరు వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. ఆదివారం గుమ్మిరెడ్డిపల్లెకు చెందిన ఆనంద్ కుటుంబ సభ్యులతో కలసి ముదరందొడ్డిలో అత్తారింటికి వెళ్లి ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. అదేసమయంలో కేజీఎఫ్ నుంచి తమిళనాడుకు వెళుతున్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొని సుమారు పది మీటర్లు ఈడ్చుకుంటూ వెళ్లి రోడ్డు పక్కనున్న డివైడర్‌ను ఢీకొని ఆగింది. ఈ ఘటనలో ఆనంద్ (36), హేమావతి (28), వైభవ్(4), నేహాంత్ (2) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను 108లో కుప్పం మెడికల్ కళాశాల ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఆనంద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా విరూపాక్షమ్మ జాతర ప్రారంభం




కల్లూరులో విరూపాక్షమ్మ, గేటుకాడ బెస్తపల్లిలో కావమ్మ మారయ్యల అలంకరణ

కల్లూరు, మే 19: పులిచెర్ల మండలం కల్లూరులో కొలువైన విరూపాక్షమ్మ ఆలయంలో ఆదివారం జాతర వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉదయం కలశస్థాపన, రుత్విక్ కంకణం, గంగస్వీకరణ, గణపతిహోమం, గెరిగపూజ, దుర్గాహోమం, శక్తిపూజ, అభిషేకం, మహా మంగళహారతి నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన, దుర్గాదేవి అలంకరణ, రాత్రి ఊంజల్‌సేవ జరిపించారు. పుర వీధుల గుండా మహిళలు అమ్మవారికి గంగను తీసుకొచ్చిన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.

● కావమ్మ, మారయ్యలకు సారె పంపిణీ

ఎర్రపాపిరెడ్డిగారిపల్లి పంచాయతీ గేటుకాడ బెస్తపల్లిలో కొనసాగుతున్న కావమ్మ, మారయ్య ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా కావమ్మ మారయ్యకు భక్తులు సారె సమర్పించారు. ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం జంగాలకథ వినిపించారు. అన్నదానం చేశారు.

జగన్‌రెడ్డి ఖేల్ ఖతం!

- ప్రభుత్వ కార్యాలయాల్లో పత్రాలు ధ్వంసం కాకుండా చూడాలి
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాజుల ఖాదర్‌బాషా



మైనారిటీల సమావేశంలో మాట్లాడుతున్న గాజుల ఖాదర్‌బాషా

కుప్పం, మే 19: రాష్ట్రంలో జగన్‌రెడ్డి ఖేల్ ఖతం అయిపోయిందని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. కుప్పంలో చంద్రబాబు లక్ష మెజారిటీతో గెలవడమే కాక ఆయన ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. అదే సమయంలో వైసీపీ ఇన్నాళ్లూ ప్రభుత్వ కార్యాలయాల కేంద్రంగా జరిపిన అవినీతి పనుల సాక్ష్యాలు చెరిగిపోకుండా ఆయా కార్యాలయాల్లోని డాక్యుమెంట్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కుప్పంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మైనారిటీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలన అంతా తప్పుల తడకేనని విమర్శించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే తామెక్కడ జైళ్లపాలు కావాల్సి వస్తుందోనని కొంతమంది అధికారులు భయపడు తున్నారన్నారు. చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు కార్యాలయాల్లోని డాక్యుమెంట్లను మాయం చేయడానికి లేదా ధ్వంసం చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా పోలీసు స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు తగులబెడుతున్నారని తీవ్ర ఆరోపణ చేశారు. ఏ ఒక్క ఫైల్ కూడా ధ్వంసం కాకూడదంటూ డీజీపీ అన్ని స్టేషన్లకు ఆర్డర్ పాస్ చేయాలని కోరారు. అధికార పార్టీ నాయకులతో లాలూచీపడి అక్రమాలకు పాల్పడిన అధికారులు తప్పించుకోలేరని స్పష్టం చేశారు. తాను ఓడిపోతున్నట్లు జగన్‌కు అర్థమైందని అందుకే ప్యాక్‌లు మూసేసి విదేశాలకు చెక్కేశారని ఎద్దేవా చేశారు. ఇటువంటి జగన్ మాటలు విని అధికారులు ఇంకా తప్పులు చేస్తే మాత్రం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. మాచర్ల, చంద్రగిరి, తాడిపత్రి, నరసరావు పేటల్లో ఇంకా కొంతమంది అధికారులు వైసీపీకి కొమ్ముకాస్తూ పనిచేస్తున్నారనిఆరోపించారు. మైనారిటీలు జగన్ అండ్ కో చేసిన అసత్య ప్రచారాలను నమ్మలేదని పేర్కొన్నారు. చంద్రబాబుకే వారంతా గంపగుత్తగా ఓటు వేశారని తెలియజేశారు. ఈ సమావేశంలో టీడీపీ మైనారిటీ నాయకులు సర్దార్‌బాషా, అన్సర్ బాషా, గని, సుభాన్, ఫైరోజ్, చాంద్, ఉమర్, షంషేర్, మునాఫ్, చిన్న ఉమర్, ఇమ్రాన్, కాసిం, హరూన్, జావీద్, తాహిర్, సద్దాం, అల్తాఫ్, ఇస్మాయిల్, తబ్రేజ్, ఫజల్ తదితరులు పాల్గొన్నారు.

సోమలలో భారీ వర్షం

సోమల, మే 19: సోమల మండలంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి సోమలలో 42.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తన కాయలు వేసుకునేందుకు రైతులు తమ పొలాలు దుక్కులు చేసుకునేందుకు అనువుగా వర్షం పడడంతో ఆనందపడుతున్నారు. పశువులకు మేతకు ఇబ్బందులు తీరుతాయని అంటున్నారు.

సదుంలో మోస్తరు వర్షం

సదుం, మే 19: మండలంలో రెండు రోజులుగా కొన్ని గంటలపాటు కురిసిన వర్షాలకు ఒక్కసారిగా వాతావరణం పూర్తిగా చల్లబడింది. శనివారం రాత్రి 9 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు సుమారు రెండు పదునుల వర్షం కురిసింది. ఆదివారం కూడా సాయంత్రం నుంచి గాలులు లేని వర్షం పడింది. దీంతో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం లభించింది. అరకొరగా దిగుబడి వచ్చిన మామిడి కాయకు నాణ్యత, బరువు పెరుగుతుందని మామిడి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత నంజంపేట



విజేతకు అవార్డు అందజేస్తున్న దాత

సోమల, మే 19: నంజంపేట ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పూర్వ విద్యార్థి అనూబేగ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ జరిగింది. ఆదివారం ఫైనల్స్‌లో నంజంపేట విజేతగా నిలించింది. అనంతరం టోర్నీలో పాల్గొన్న 12జట్లకూ నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గనేశ్, అజయ్, హరీశ్, చాను, నాని, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరి అమ్మవారి జాతర



ఊరేగింపునకు సిద్ధం చేసిన అమ్మవారు

రొంపిచెర్ల, ఏప్రిల్ 19: మండలంలోని పెద్దమల్లెల పంచాయతీ నడింపల్లెలో శనివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు చౌడేశ్వరి అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులు అమ్మవారికి బోణాలు, దీలు సమర్పించారు. ఆదివారం ఉదయం జతుబలులతో మొక్కులు తీర్చుకున్నారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు మదనపల్లె, వీరబల్లి, రాయచోటి, రంగన్నగారిగడ్డ నుంచి తొగట వీర చత్రియ కులస్తులు విచ్చేసి అమ్మవారికి పూజలు చేశారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

తగ్గిన మామిడి దిగుబడి

- 30 శాతానికి పడిపోయిన వైనం
- ఆందోళనలో రైతులు


నారపరాజుకండ్రిగలో కాయలు లేని మామిడి తోట

విజయపురం, మే 19: మండలంలో మామిడి దిగుబడి భారీగా తగ్గింది. మండలంలో 1,850 ఎకరాలలో మామిడి సాగవుతోంది. జగన్నాథపురం, క్షూరికాపురం, విజయపురం, కోసలనగరం, జంబాడ, పాతార్కాడు, మహారాజపురం, మల్లారెడ్డికండ్రిగ, శ్రీహరిపురం, నారపరాజు కండ్రిగ ప్రాంతాలలో సింధూర, తోతాపురి, బంగినపల్లి, కాలేపాడు, ఖాదర్, నీలం వంటి రకాలు రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి రైతులు పూత కోసం రెండు, మూడు పర్యాయాలు మందులు పిచికారీ చేశారు. ఆశించిన స్థాయిలో పూత వచ్చినా వాతావరణంలో మార్పుల కారణంగా కాయలు నిలవలేదు. 30 శాతం వరకు దిగుబడి తగ్గిందని రైతులు చెబుతున్నారు.

ఎకరాకు ఖర్చు రూ.30 వేలు

ఎకరా మామిడి సాగుకు రూ.30 వేల వరకు ఖర్చు అయ్యిందని రైతులు చెబుతున్నారు. దుక్కి దున్నడం, పురుగు మందుల వరకు చేసిన ఖర్చులు సైతం వెనక్కు వచ్చేలా లేవని వాపోతున్నారు. ఎక్కువ మంది కౌలు రైతులు ఉన్నారని, వారు ఎకరాకు రూ.15 వేలు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చిందని అంటున్నారు. సింధూర టన్ను రూ.20 - 25 వేలు, ఖాదర్ రూ.40 - 45 వేలు, తోతాపురి రూ. 20 - 22 వేలు వరకు పలుకుతున్నాయని, అది ఏ మాత్రమూ గిట్టుబాటు కాదని చెబుతున్నారు.

మంచు తీవ్రతతో ఆలస్యంగా పూత

మంచు తీవ్రత వల్ల పూత ఆలస్యంగా వచ్చింది. మందులు పిచికారీ చేస్తే పూత వచ్చినా నిలవలేదు. పిందెలు రావడం, కుళ్లి రాలిపోవడం జరిగిందని రైతులు చెబుతున్నారు. నిలబడిన కాయలకు మచ్చలు వచ్చాయని వాపోతున్నారు.

అన్నదానానికి రూ.5 లక్షల విరాళం


దాతకు జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్

ఐరాల(కాణిపాకం), మే 19: కాణిపాక వరసిద్ధి వినాయక ఆలయ అన్నదాన పథకానికి గాను తిరుపతి జిల్లా పిచ్చాటూరుకు చెందిన పెమ్మసాని మునిశేఖర్ నాయుడు ఆదివారం రూ.5లక్షలు విరాళంగా అందించారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ


గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో మానవహారం

చిత్తూరు రూరల్, మే 19: అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా నగరంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం చేపట్టారు. ఎయిడ్స్ మృతుల ఆత్మశాంతి కోసం జిల్లా ఎయిడ్స్, జిల్లా టీబీ నివారణ శాఖ అధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించినట్లు జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్ తెలిపారు. యూనిట్ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కాలువను బాగు చేయండి


పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న కాలువ

కార్వేటినగరం, మే 19: పిచ్చి మొక్కలతో నిండిపోయిన కార్వేటినగరం చెరువు కాలువను గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద బాగు చేయాలని రైతులు కోరుతున్నారు. కాలువ పూడిపోవడంతో ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు చెరువుకు చేరడం లేదని తెలిపారు. పైగా కోట చెరువు నిండిన తర్వాత కూడా నీరు రాకపోవడంతో చెరువు ఎండిపోయి, వందలాది ఎకరాలు బీడుగా మారే ప్రమాదం ఏర్పడిందని పేర్కొన్నారు. అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

విచ్చలవిడిగా విద్యుత్ చౌర్యం


లైన్ నుంచి తీసిన అక్రమ కనెక్షన్లు

కార్వేటినగరం, మే 19: మండల కేంద్రంలో విద్యుత్ చౌర్యం యథేచ్ఛగా జరుగుతోంది. రాత్రిపూట లైన్‌కు దోట్లు తగిలించి పలువురు విద్యుత్ వాడుకుంటున్నారు. అధికార పార్టీ నేతల అండతో లైన్ నుంచి విద్యుత్‌ను వాడుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు



కార్వేటినగరం, మే 19: విద్యార్థుల కోసం వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు తెలిపారు. ప్రతిరోజూ ఒక్కొక్క అంశంపై శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నానీకి దేశమ్మగుడి మాజీ చైర్మన్ పరామర్శ



నగరి, మే19: టీడీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని ఆదివారం నగరి దేశమ్మ గుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి పరామర్శించారు. తిరుపతిలోని ఆయన నివాసంలో కలుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఓటమి భయంతోనే వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడ్డాయని విమర్శించారు. పార్టీ నేతలు గజేంద్రనాయుడు, వెంకటరత్నం, చంద్రయ్య ఆయన వెంట ఉన్నారు.

విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి


మండల కేంద్రానికి చేరిన విత్తనకాయలు

పెనుమూరు, మే 19: వేరుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు రైతుభరోసా కేంద్రాల వద్ద 23వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారి కళ్యాణ్‌బాబు తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకం, వన్‌బీ, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. మండలానికి 1,300 క్వింటాళ్ల కే6 రకం విత్తనాలు వచ్చాయని, ఎకరం భూమి కలిగిన వారికి రెండు బ్యాగులు(30కేజీలు) ఒక్కోటి రూ.1,710చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు.

24న పుష్ప పల్లకి సేవ

చిత్తూరు కల్చరల్, మే 19: గిరింపేట బొందు వీధి వేంకటేశ్వరాలయంలో ఈనెల 24న స్వామివారికి పుష్పపల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి, పుర వీధులలో ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు.

యోగా ఏకాగ్రత పెంచుతుంది

చిత్తూరు (సెంట్రల్), మే 19: యోగా ఏకాగ్రతను పెంచుతుందని యోగా ట్రైనర్ మోహన్ పేర్కొన్నారు. డీటీసీలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా రెండో రోజైన ఆదివారం ఎన్‌సీసీ క్యాడెట్‌లకు యోగాలో శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ యోగా ఏకాగ్రతను పెంచడంతోపాటు మానసిక వికాసం కలిగిస్తుందన్నారు. క్యాంపు కమాండెంట్ మేజర్ లోకనాథన్, ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, గిరిధర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



గుడిపాల, మే 19: మండలంలోని రామభద్రాపురం గ్రామ పంచాయతీలో ఎట్టకేలకు బోరు మోటర్‌కు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. తాగునీటి బోరుకు ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో గ్రామస్తులు కొన్ని రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. దీన్ని గమనించిన సర్పంచ్ హరిణి హేమాద్రి నాయుడు జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.3.05 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

బంగారుపాళ్యం, మే 19: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని మొగిలి ఘాట్‌లో ఈనెల 15వ తేదీ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాగభూషణం తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు. వరికసువు లోడ్డుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొన్న ఆ ఘటనలో కీరమందకు చెందిన ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన విషయం విదితమే.

వరికోత మిషన్‌లో జుట్టు తగులుకుని మహిళకు గాయాలు

బంగారుపాళ్యం, మే 19: వరి నూర్పిడి మిషన్‌లో బెల్టుకు జుట్టు తగులుకొని మహిళ గాయపడిన ఘటన మండలంలోని రాగిమానిపెంటలో ఆదివారం చోటుచేసుకుంది. రాగిమానిపెంట దళితవాడకు చెందిన వెంకటేష్ భార్య తన పొలంలో వరి నూర్పిడి చేస్తుండగా వెంట్రుకలు మిషన్‌లో తగులుకుని తీవ్రంగా గాయపడింది. ఆమెను 108 ద్వారా బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం చిత్తూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

వర్షపు నీటితో వాహనదారుల అవస్థలు



గంగాధరనెల్లూరు, మే 19: చిత్తూరు - తచ్చూరు హైవే రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా మండలంలోని వరత్తూరు పంచాయతీ పరిధిలో కాశపల్లె - బోడపూరు మధ్యలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఇరువైపుల పాత తారురోడ్డు కంటే పల్లంగా పెట్టడంవల్ల వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారింది. రాకపోకలు సాగించడానికి ద్విచక్ర వాహనదారులు, కార్లు, ట్రాక్టర్లు, బస్సులు, ప్యాసింజర్ ఆటోలు, పాలవ్యాన్లు ఇబ్బంది పడాల్సి వస్తోంది. నీటిని బయటకు పంపే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అసంపూర్తిగా ఆరోగ్య ఉప కేంద్రం



గుడిపాల, మే 19: మండలంలోని ఏఎల్‌పురంలో గత టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఆరోగ్య ఉపకేంద్ర భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. అప్పట్లో నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించినా ప్రభుత్వం మారడంతో నిలిచిపోయాయి. మధ్యలో పూతపని చేసి అలాగే వదిలేశారు. సిబ్బందికి కూర్చునే వీలులేక, మందులు దాచుకోలేక అవస్థలు పడుతున్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


మృతిచెందిన వీరాసామిరెడ్డి

నగరి మే19: విద్యుత్ షాక్‌తో రైతు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని కావేటి రాజపురంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వీరాసామిరెడ్డి (53) పంటకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లి మోటారు ఆన్ చేశాడు. స్విచ్ తాకగానే షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పక్క పొలాల రైతుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సోమలలో భారీ వర్షం

సోమల, మే 19: సోమల మండలంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి సోమలలో 42.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తన కాయలు వేసుకు నేందుకు రైతులు తమ పొలాలు దుక్కులు చేసుకు నేందుకు అనువుగా వర్షం పడడంతో ఆనందపడు తున్నారు. పశువులకు మేతకు ఇబ్బందులు తీరుతాయని అంటున్నారు.

సదుంలో మోస్తరు వర్షం

సదుం, మే 19: మండలంలో రెండు రోజులుగా కొన్ని గంటలపాటు కురిసిన వర్షాలకు ఒక్కసారిగా వాతావరణం పూర్తిగా చల్లబడింది. శనివారం రాత్రి 9 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు సుమారు రెండు పదునుల వర్షం కురిసింది. ఆదివారం కూడా సాయంత్రం నుంచి గాలులు లేని వర్షం పడింది. దీంతో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం లభించింది. అరకొరగా దిగుబడి వచ్చిన మా మిడి కాయకు నాణ్యత, బరువు పెరుగుతుందని మామిడి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత నంజంపేట

సోమల, మే 19: నంజంపేట ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పూర్వ విద్యార్థి అనూబేగ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ జరిగింది. ఆదివారం ఫైనల్స్‌లో నంజంపేట విజేతగా నిలిచింది. అనంతరం టోర్నీలో పాల్గొన్న 12జట్లకూ నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గణేశ్, అజయ్, హరీశ్, చాను, నాని, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరి అమ్మవారి జాతర


ఊరేగింపునకు సిద్ధం చేసిన అమ్మవారు

రొంపిచెర్ల, ఏప్రిల్ 19: మండలంలోని పెద్దమల్లెల పంచాయతీ నడింపల్లెలో శనివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు చౌడేశ్వరి అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులు అమ్మవారికి బోనాలు, దీలు సమర్పించారు. ఆదివారం ఉదయం జతుబలులతో మొక్కులు తీర్చుకున్నారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు మదనపల్లె, వీరబల్లి, రాయచోటి, రంగన్నగారిగడ్డ నుంచి తొగట వీర చత్రియ కులస్తులు విచ్చేసి అమ్మవారికి పూజలు చేశారు.

అ'పూర్వ' సమ్మేళనం

- 41 ఏళ్ల తర్వాత కలిసిన జీడీనెల్లూరు హైస్కూల్ పూర్వ విద్యార్థులు



గంగాధరనెల్లూరు, మే 19: స్థానిక హైస్కూల్లో 1982-83లో 10వ తరగతి చదివిన విద్యార్థులు 41ఏళ్ల తర్వాత ఆదివారం కలిశారు. చిత్తూరులోని ఒక హోటల్లో ఏర్పాటు చేసుకున్న ఆత్మీయ సమ్మేళనంలో ఒకరినొకరు కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి విద్యార్థులైన ప్రభాకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, రవీంద్రనాయుడు, మధుసూదన్, నిత్యానందంనాయుడు, జయచంద్రనాయుడు, రెడ్డెప్పరెడ్డి, చంద్రన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సుబ్రమణ్యం, శారద, లలిత, శకుంతలను ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ 2023-24 బ్యాచ్ పదో తరగతి, హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశామని, ఇకపై ఏటా ఈ స్కూల్లో చదివిన ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ప్రకటించారు.

మానవీయ విలువలకు ప్రామాణికాలు ఇతిహాసాలు


ఉపన్యసిస్తున్న శాంతాభాస్కర్

చిత్తూరు కల్చరల్, మే 19: మానవీయ విలువలకు పురాణ ఇతిహాసాలు ప్రామాణికాలని ప్రముఖ రచయిత్రి శాంతా భాస్కర్ అన్నారు. ఆదివారం కొంగారెడ్డిపల్లెలోని ఒక హోటల్లో చదివే రాజారెడ్డి, సువర్చల స్మారకార్థం చిత్తూరు చైతన్య సాహితి, హరివిల్లు లలితకళా వేదిక సంయుక్త ఆధ్వర్యంలో భాగవతంలో స్తుతులు స్మారకోపన్యాసం చేశారు. బమ్మెర పోతనామాత్యులు విరచిత మహా భాగవతంలోని పలు శ్లోకాలను వివరించారు. సాహితీవేత్తలు దండాల రాధాకృష్ణారెడ్డి, వి. హరినాయుడు, బి.మునుస్వామి, గోవిందన్, భాస్కర్ రెడ్డి, శ్యామలదేవి, రాగూర్ సుజాత, జి. జయరాంరెడ్డి, ఎడ్ల బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తాం : సీకే


నగలను మీడియాకు చూపుతున్న సీకే బాబు తదితరులు

చిత్తూరు కల్చరల్, మే 19: నగరంలో మంగళ, బుధవారాలు చిత్తూరు నడివీధి గంగమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ వంశ పారంపర్య ధర్మకర్త, చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు తెలిపారు. ఆదివారం ఆయన బ్రాహ్మణ వీధి గీతాసంఘం భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అమ్మవారికి సమర్పించనున్న ఆభరణాలను ప్రదర్శించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంగళవారం ఉదయం అమ్మవారికి తొలిపూజ నిర్వహించి, భక్తులకు దర్శనానంతరం అంబలి పంపిణీ చేయనున్నట్లు సీకే సాయికృష్ణారెడ్డి తెలిపారు. ఈ మీడియా సమావేశంలో హేమంత్ కుమార్, మల్లి ఆచారి, సత్య, రవి తదితరులు పాల్గొన్నారు. కాగా, నగరంలోని సంతపేట నడివీధి గంగమ్మ జాతరకు సంబంధించిన బ్రోచర్‌ను ఉత్సవ ధర్మకర్త భూపేష్ గోపినాథ్ ఆదివారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు.

డాక్టరేట్ల ప్రదానం


డాక్టరేట్ అందుకుంటున్న విజయసింహారెడ్డి, సుందరరాజ్

గంగాధరనెల్లూరు, మే 19: బెంగళూరుకు చెందిన భారత విర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ ఎడ్యుకేషన్ ద్వారా ఇద్దరు మండల వాసులు డాక్టరేట్ పొందారు. శనివారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్‌లు అందుకున్నారు. పాతపాళ్యం గ్రామానికి చెందిన జిల్లా రెవెన్యూ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, రిటైర్డ్ తహసీల్దార్ మాదిరెడ్డి విజయసింహారెడ్డి ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేసినందుకు, అంబోదరపల్లె దళితవాడకు చెందిన బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరరాజ్ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసినందుకు వర్సిటీ డాక్టరేట్‌లు ప్రదానం చేసింది. డాక్టరేట్లు పొందిన వారిద్దరినీ పలువురు అభినందించారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ


ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, మే19: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఉదయం ఆలయంలో అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు అర్చనలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచియే గాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల ఏర్పాట్లును ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు.

కనుల పండువగా ఆది దంపతుల కల్యాణం



చౌడేపల్లె, మే19: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో 7వ రోజు వేదపండితులు శాస్త్రోక్తంగా ఆదిదంపతులకు కళ్యాణం నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమార, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి ఆలయంలో మృత్యుంజయేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కళ్యాణం జరిపించారు. అనంతరం పూలతో, ప్రభలతో, విద్యుత్ దీపాలతో అలంకరించిన గజవాహనంపై స్వామి అమ్మ వార్లను అధిష్టింపజేశారు. తర్వాత మంగళ వాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాల నడుమ పుర వీధుల్లో ఊరేగించారు. మహిళలు కర్పూర హారతులు సమర్పించారు. ఉభయదారులుగా దొంతె శివశంకర్, మజరారెడ్లు వ్యవహరించారు.

అశ్వవాహనంపై ఆదిమ దైవం



కుప్పం, మే 19: ఆదిమ దైవం అమ్మతల్లి. ఆ అమ్మతల్లికి ప్రతిరూపమే గ్రామ దేవతలు. కుప్పంలో వెలసిన అనాది దైవమైన ప్రసన్న తిరుపతి గంగమాంబ ప్రతిరూపమైన ముత్తు మారెమ్మ అమ్మవారు ఆదివారం రాత్రి అశ్వవాహనంపై వేంచేశారు. యోధో చిత అలంకరణలో అశ్వా రూఢులై కదం తొక్కారు. ఉదయం నుంచి గంగమ్మ అమ్మవారితోపాటు ముత్తు మారెమ్మ అమ్మవారికి కూడా ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఎస్పీ మణికంఠతోపాటు పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అవుతుండగా ముత్తుమారెమ్మ ఉత్సవ మూర్తికి ప్రత్యేక అలంకరణ చేశారు పూజారులు. అశ్వవాహనికి సైతం మెరుగులు దిద్దారు. అమ్మవారిని పూజారులు ఊరేగింపుగా తీసుకొచ్చి అశ్వవాహనారూఢురాలిని చేశారు. అంతే.. ముత్తుమారెమ్మ కుప్పం వీధులలో కదం తొక్కారు. కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిస్తున్న భక్తులను కరుణించారు.

అసంపూర్తిగా ప్రభుత్వ భవనాల నిర్మాణం


కృష్ణజిమ్మాపురంలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనం

పాలసముద్రం, మే 19: మండలంలో ప్రభుత్వ భవనాల నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోయింది. సచివాలయ భవనానికి రూ.37లక్షలు, వెల్‌నెస్ సెంటర్, రైతుభరోసా భవనాలకు రూ.17 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కృష్ణజిమ్మాపురంలో సచివాలయ భవన నిర్మాణ పనులను మూడేళ్ల క్రితం వైసీపీ నాయకులు కాంట్రాక్టర్ తీసుకుని పనులు ప్రారంభించారు. మొదటి అంతస్తు పూర్తిచేసి, రెండో అంతస్తు నిర్మాణం కోసం గోడలు మాత్రం నిర్మించి ఆపేశారు. రైతు భరోసా కేంద్రం పునాదులకే పరిమితమైంది. వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణ పనులు లోపల ఫ్లోరింగ్, గోడలకు పూతపని, వైరింగ్ వంటివి చేయాల్సి ఉంది. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను అర్ధంతరంగా ఆపేశారన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం సచివాలయం చిన్న భవనంలో కొనసాగుతోంది. తగిన సౌకర్యాలు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.